# ఉష్ణమొస్తే బొవ్వుణ్ణాం.

'పదహా రార్లు తొంభైఆరూ!'

చిన్నవాడు కునికిపాట్లు పడుతూ వల్లిస్తున్నాడు పదహారో ఎక్కాన్ని. నాన్న తను తిరిగొచ్చేదాకా ఎక్కాల్ని కంఠతా పెట్టమన్నాడు. చిన్నవాడికి నిద్రవస్తూన్నాది. కానీ, నాన్నభయంచేత దీపంముందుకు జోవలసివచ్చింది.

'పదహా రేళ్ళు నూట...'

వెధవెక్కం అని విసుక్కున్నాడు. వల్లించమన్న నాన్ననికూడా తిట్టేడు. నాన్నసొమ్మేం పోయింది? నాలుగు ప్రక్కలా చూశాడు. అమ్మమ్మ నట్టింట్లో ఏదో వెర్రి మొర్రి పాట పాడుకుంటూ అంట్లూ ఎంగిళ్ళు చేసుకొంటున్నాది. అమ్మ అన్న మంచంప్రక్క కూచొని, వాడి తలమీద అయిసు పెడుతున్నాది. ఎవరూ తన్ను చూడ్డంలేదు. చిన్నవాడు తను కష్టపడి చదవటం, ఎవరూ చూడకపోవడం చూసి చాలా అసంతృప్తిపడ్డాడు. ఘట్టిగా 'పదహారేళ్ళు నూటపన్నెండు' అని అరచేడు. ఎవరూ లక్ష్యపెట్టలేదని గ్రహించి, ఇంకా ఘట్టిగా ఇల్లెగరకొట్టూ 'పదహారెనిమిదులు నూటాఇరవైఎనిమిది' అని దీర్ఘాలుతీస్తూ పాట మొదలెట్టాడు.

ఈసారి చిన్నవాడి వాంఛ కొద్దిగా సఫలీకృతమైంది. పెద్దవాడు కళ్ళువిప్పి 'అమ్మా! వాణ్ణి అరవొద్దనేశ,' అని అన్నాడు. అమ్మ వాడినొసట చెయ్యిపెట్టి ఉష్ణపువేడిని

చూస్తూ 'ఏమిటి నాయనా?' అని అడిగింది. 'వాణ్ణరవొద్దనే' అని వాడు చాలా నెమ్మదిగా చెప్పేడు. అమ్మ 'ఒరే చిన్న వాడా, అరవకురా!' అని కేకేసింది. 'అబ్బ! ఎక్కాలు చదువు కొంటున్నానే' అని నిర్లక్ష్యంగా జవాబుచెప్పి 'పదహారొకట్ల పదహారూ' అని ముందుకొచ్చాడు. 'ఒరేయ్ నీకుకాదురా చెప్పేది' అని అమ్మ అంది. 'హుఁ, నాన్న కోంపడతారు. ఎక్కాలు అప్పజెప్పాలే!' అని చిన్నవాడన్నాడు. 'నేచెప్తా కోంపడరు. వెళ్ళిపడుకో' అని అమ్మ అంది. వెంటనే చిన్న వాడు పక్కమీదకి దూకేడు. వాచీ పదికొట్టింది.

అదేమోగాని చిన్నవాడికి నిద్రరాలేదు. పడుక్కొని ఆలోచించుకొంటున్నాడు.

రేపు సోమవారం. మళ్ళీబడి. పొద్దున్నే లేవాలి. రేపూ ఆదివారమైతే బావుణ్ణు. శలవులు ఎప్పుడిస్తారో కదా? అన్నకి పన్నెండురోజులనుండీ ఉష్ణం. తనకే ఉష్ణమొస్తే బావుణ్ణు ఎంచక్కా బడి మానీవచ్చు మరింక ఎక్కాలూ లెక్కలూ ఇవన్నీ వుండవు. ఇంక నాన్నగూడా గోడకుర్చీలు వేయించడు. మరి కొంటిపిక్కలూ తొడపాశాలూ ఏంవుండవు. అన్నని పూర్వంలాగా నాన్న కొట్టడంలేదు. 'నాయనా!' అని నెమ్మదిగా పిలుస్తాడు.

అవును; తనకే ఉష్ణమొస్తే బావుణ్ణు. అన్నకి ద్రాక్ష పళ్లు, బత్తాయిపళ్లూ తెచ్చియిస్తారు. తనకి ఎవరూ ఇవ్వరు. అన్న మంచివాడే. అన్నీ తను తినడు. అసలు ఒకప్పుడు తినే తినడు అన్నీ తనకే ఇచ్చేస్తాడు. రెండురోజులాయి అన్నకి పళ్ళు ఇవ్వలేదు. అన్న చాలా మంచివాడేగానీ

వెధవ ఉష్ణం లేని రోజుల్లో ఎప్పుడూ తనతోటి దెబ్బలాటలే. పలకపుల్లకీ, పెన్సిలుకీ అన్నింటికీని ఒంటెత్తు వెధవ. ఉష్ణమొచ్చాక తలమీద ఐసు పెట్టారు, వెధనది చక్కా తననివ్వకుండా. వేడికి చలవ, చలవకి వేడి లండామాల్. ఎంచక్కా వుంటుంది. నిన్న ఓమక్క తీసుకొంటే నాన్న వీపు పెట్ల కొట్టి 'ఛీ వెధవా' అన్నాడు

ఆలోచించుకొంటూ చిన్నవాడు నిద్రపోయేడు. చిన్నవాడికి నిద్రపోయేక కల వచ్చింది. ఒక మంచంమీద తను పడుకున్నాడు. తన తలమీద అమ్మ ఐస్ బేగ్ పెట్టింది. తను మంచంమీద పడుకొని ఎక్కాలు చదువుకుంటున్నాడు. నాన్న 'వెధవా! గోడకుర్చీ వేయ్' అని గద్దించేడు. 'నాకు ఉష్ణమొచ్చింది, నేను ఎక్కాలు చదవను' అని తను తిరగబడ్డాడు కానీ, నాన్న సొంటిపిక్క పెట్టేడు. తను నవ్వుతున్నాడు. విస్కీలడ్డూ తింటూ తను బడికి వెళ్ళాడు మాస్టరుగారి కుర్చీలో నాన్న కుర్చున్నాడు. 'నాకు ఉష్ణమొచ్చింది, నేను బడికి రాను మాస్టరూ!' అని చెప్పాడు. బళ్లో మరెవరూ పిల్లలు లేరు తనొక్కడే అనుకొంటున్నాడు. రాత్రి రెండవుతుంది. చిన్నవాడు వత్తిగిలేడు. చలి బాగా వేస్తున్నది. వాడు రాత్రి పక్కలోకిబోయేముందు కప్పుకోలేదు. వాడికి తెలివివచ్చేసింది. అమ్మా నాన్నా మాట్లాడుకొనే మాటలు వాడికి వినబడుతున్నాయి.

'రెండున్నరా?'

'ఊఁ!'

'మందు వేళయిందికదూ!'

'ఊఁ!'

'పడుకొన్నాడు. లేపనా?'

'వద్దు, లేపకూడదు.'

చిన్నవాడు కళ్ళుమూసుకొనే ఈమాటలు వింటున్నాడు చిన్న చలిగాలి వీచింది. వళ్ళు ఝల్లుమంది. కీచురాయి గీపెట్తూంది. 'అమ్మా, చలే' అన్నాడు.

'చిన్నవాడి కేదేనాకప్పు!' అన్నాడు నాన్న మెల్లిగా. చిన్నవాడు కళ్లువిప్పేడు. దీపం మసిబారింది. మసక మసగ్గా ఉంది. అమ్మా నాన్నా అన్న మంచానికి రెండుప్రక్కలా కూర్చొన్నారు. అన్న మంచానికి ఒపక్క బల్లమీద మందు సీసా లున్నాయి వాచీ టిక్ టిక్ మంటూన్నాది! ఒకమూల అమ్మమ్మా వాళ్ళూ పడుకొన్నారు అమ్మ లేచి తనకి శాలువ కప్పింది.

చిన్నవాడికి చిన్న మాగన్ను పట్టింది. ఒక కారడవిలో తనున్నాడు. అన్న పలకపుల్ల తెచ్చాడు. చిన్నవాడికి చాలా గొంతుకలు వినబడుతున్నాయి. 'ఎలావుంది?' అని ఓగొంతు ప్రశ్నించింది. 'చాలా వేడిగా వుంది; కాగిపోతున్నాది' అని తనే చెపుతున్నాడు. చిన్నవాడికి మెళకువ వచ్చింది. టైమెంతయిందో తెలీదు చిన్నవాడికి వాచీ చూడ్డంరాదు. కానీ ముళ్ళెక్కడున్నాయో చెప్తాడు. చిన్నవాడు కళ్ళు విప్పలేదు. వింటున్నాడు

'ఎలా ఉందే?'

'చాలాజాస్తిగా, వళ్ళు కాలిపోతున్నది.'

'అల్లుడు బా బేడీ?'

"డాక్టర్ని తీసుకురావడానికెళ్ళారు."

"ఎంతసేపాయి?"

"పావుగంట నిన్ను లేపలేక పోతామనుకున్నాను గానీ ఒక్కర్తెనే ఉండలేక భయమేసింది..."

చిన్నవాడు కళ్ళువిప్పేడు. అమ్మా, అమ్మమ్మా, పిన్నీ అంతా మాట్లాడుకుంటున్నారు. నాన్న లేడు. దీపం గాలికి మండింది. అమ్మ వత్తి హెచ్చించింది. చిన్నముల్లు నాలుక్కీ ఐదుకీ మధ్య, పెద్దముల్లు ఆరుకీ ఏడుకీ మధ్య ఉన్నాయి.

"అమ్మా! దాహమేస్తోంది" అన్నాడు. అమ్మమ్మ వచ్చి తనకి మంచినీళ్ళిచ్చింది. ఇంతలోకే నాన్నా డాక్టరు గారూ వచ్చారు. డాక్టరుగారు పంచా, పైమీద వాణీ వేసుకొన్నారు. డాక్టరుగారు రిస్టువాచీ చూస్తూ అన్న చెయ్యి చూశారు. తరవాత తన కెవరో అడ్డమొచ్చారు. అమ్మా నాన్నా అంతా రాత్రి పడుకున్నట్టులేదు. అందరూ ఆందోళనగా ఉన్నారు.

అన్న చచ్చిపోడుకద! అన్న చచ్చిపోకూడదు. చచ్చిపోడు. వాడికి ఉష్ణంపోతుంది. తనకి ఉష్ణమొస్తే చావుణ్ణు గానీ, అమ్మో ఉష్ణమొస్తే చచ్చిపోతారు. ఎవరికీ ఉష్ణం రాకూడదు. చిన్నవాడు ఆలోచించుకుంటూ పక్కమీద దొర్లాడు. ముసుగుతన్ని పడుక్కున్నాడు.

అంతా గోల్లుమంటూ ఉంటే తను లేచాడు. బాగా తెల్లవారింది. తను లేచి చూశాడు. అన్న మంచం ఖాళీ.

వరండా మీద అన్నని పడుకోబెట్టారు. అమ్మ అన్న మీద పడి ఏడుస్తున్నది. అంతా ఏడుస్తున్నారు. నాన్న తలుపు కాడ నిలబడి కళ్ళెంట నీరు కారుస్తున్నాడు. ఇది చూడగానే చిన్నవాడికి గుండెల్లో కుదుపొచ్చింది. దానితోనే వాడి వళ్లు కాగ మొదలెట్టింది. తను దగ్గర కెళ్ళాడు. ఎవరో 'ఝుకుసు కొంటూ' వంటూ ప్రక్కకు తీసుకుపోయారు.

---